క్లుప్తంగా

వాహనాల వేలం ద్వారా రూ.2.13 లక్షల ఆదాయం



దేవరపల్లిలో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

దేవరపల్లి: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన తొమ్మిది వాహనాలకు అధికారులు బుధవారం స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించారు. రాజమహేంద్రవరం ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు, సీఐ దిమ్మల సుధ వేలం నిర్వహించారు. వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.2,13,816 ఆదాయం వచ్చినట్టు సీఐ సుధ తెలిపారు. అనంతరం 2022 డిసెంబరు, 2023 జనవరి నెలల్లో పట్టుబడిన 180 లీటర్ల సారా, 33 మద్యం సీసాలను మధ్యవర్తుల సమక్షంలో స్టేషన్ వద్ద ధ్వంసం చేసినట్టు ఆమె తెలిపారు.

గండిపోశమ్మ హుండీ ఆదాయం రూ.3.80 లక్షలు



గండిపోశమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

కొవ్వూరు: మండలంలోని కుమారదేవంలో కొలువైన గండిపోశమ్మ వారి ఆలయ హుండీని బుధవారం తెరిచి లెక్కించారు. గతేడాది డిసెంబర్ 15 నుంచి ఈ ఏడాది మార్చి15 వరకూ మూడు నెలల కాలానికి హుండీ ద్వారా రూ.3,79,762 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో ఎం.నాగరాజు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజన్‌కుమార్, ఆలయ ట్రస్టుబోర్డు కమిటీ చైర్మన్ గంధం శ్రీనివాస్, సభ్యులు అడబాల దేవి, గోరిజాల వరలక్ష్మి, మారిశెట్టి వెంకటలక్ష్మి, గద్దె బాలకృష్ణ, తాళ్లపూడి సాయిభక్త భజన సమాజం, గూటాల భజన సమాజం సభ్యులు, భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. కాగా ఈ నెల 22 నుంచి 26 వరకూ ఆలయం వద్ద ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో నాగరాజు తెలిపారు. ఉగాది రోజు అమ్మవారిని పురవీధుల్లో భారీ ఎత్తున ఊరేగిస్తామని కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు.

యువతలో రాజకీయ చైతన్యం ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న మల్లేష్

నిడదవోలు రూరల్: యువత విద్యలో రాణించడంతో పాటు రాజకీయ చైతన్యం కలిగి మంచి పౌరులుగా ఎదగాలని కామవరపుకోట డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు డి.మల్లేష్ అన్నారు. నిడదవోలు ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇ.నాగేశ్వరరావు అధ్యక్షతన ప్రజాస్వామ్య విజయానికి స్థానిక ప్రభుత్వాల ఆవశ్యకత, స్థానిక సంస్థల చట్టాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసామ్య పరిరక్షణ, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగివుండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.పద్మజ, టి.హనుమంతరావు, జి.ప్రకాశంబాబు, ఆర్.సుదర్శనరావు, బి.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న.. రైతుకు దన్ను

- మార్కెట్లో క్వింటాలు ధర రూ.2,500
- గతేడాది రేటు రూ.1800 మాత్రమే
- మెట్ట ప్రాంతంలో ఆరుతడి పంటగా సాగు
- ఎకరాకు 45 క్వింటాళ్ల దిగుబడి

దేవరపల్లి: తక్కువ పెట్టుబడితో అధికాదాయం వచ్చే పంట మొక్కజొన్న. దానికితోడు ఈ ఏడాది మొక్కజొన్నకు ఎప్పుడూ లేనంత రేటు లభిస్తోంది. దాంతో ఈ పంట సాగు చేసిన రైతుల కళ్లల్లో తమ కష్టం ఫలించిందన్న ఆనందం కనిపిస్తోంది. మెట్ట ప్రాంతంలో రబీలో ఎక్కువ మంది రైతులు ఆరుతడి పంటగా మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. బోర్ల కింద కూడా రైతులు మొక్కజొన్న వేస్తున్నారు. విత్తనం నాటిన 120 నుంచి 130 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఖరీఫ్ వరి పంట కోసిన తర్వాత ఆ భూముల్లో మొక్కజొన్న వేస్తున్నారు. మార్కెట్లో మొక్కజొన్నలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది రైతులు వరికి బదులు మొక్కజొన్న వేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ద్వారకా తిరుమల, నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంట సాగవుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో 7,386 మంది రైతులు 20,428 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గోపాలపురం నియోజకవర్గంలో 12,517 ఎకరాల్లో పంట వేసినట్టు వ్యవసాయశాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కొవ్వూరు డివిజన్‌లోని దేవరపల్లి, కొవ్వూరు, గోపాలపురం, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో 6,294 ఎకరాల్లో ఈ పంట వేశారు. ప్రస్తుతం మొక్కజొన్న కోతలు జరుగుతున్నాయి. దేవరపల్లి మండలం పల్లంట్ల కేంద్రంగా మొక్కజొన్నను ఎగుమతి చేస్తున్నారు. ప్రైవేట్ కంపెనీలు రైతులను ప్రోత్సహించి ఈ పంట వేయించి విత్తనం కొనుగోలు చేస్తోంది. ఎక్కువగా విత్తన ఉత్పత్తి చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.1 లక్ష నుంచి రూ.1.10 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను నికర ఆదాయం రూ.50,000 వస్తోందని రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న పంటను ఎక్కువగా కత్తెర పురుగు ఆశించి నాశనం చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది పురుగు బెడద లేకపోవడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. పండించిన పంటలో 90 శాతం విత్తనానికి కంపెనీలు కొనుగోలు చేస్తుండగా, 10 శాతం కమర్షియల్ పంట ఉంది.



దేవరపల్లిలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

కొవ్వూరు డివిజన్‌లో మొక్కజొన్న సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
ద్వారకాతిరుమల	4228
గోపాలపురం	3993
దేవరపల్లి	726
నల్లజర్ల	3570
మొత్తం	12,517



దేవరపల్లి మండలం పల్లంట్ల నుంచి మొక్కజొన్నను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు

మొక్కజొన్న సాగుకు మొగ్గు



మొక్కజొన్న సాగుపై మెట్ట ప్రాంత రైతులు మొగ్గు చూపుతున్నారు. మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఎకరాకు సగటున 50 నుంచి 60 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పెట్టుబడి పోను రూ. 40 నుంచి 50 వేలు మిగులుతోంది. కొవ్వూరు డివిజన్‌లోని ఐదు మండలాల్లో రబీలో 6,291 ఎకరాల్లో ఈ పంట వేశారు. మార్కెట్లో మొక్కజొన్నలకు గిరాకీ ఉంది. క్వింటాల్ రూ.2500 రేటు ఉంది. గతేడాది రూ.1800 ఉండేది.

– పి. చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

వరి తర్వాత ప్రధాన పంట

జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంటగా రైతులు మొక్కజొన్న పండిస్తున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సుమారు 20,428 వేల హెక్టార్లలో ఈ పంట సాగవుతోంద. మొక్కజొన్నను చేపలు, కోళ్లు, పశువులకు దాణాగాను, ఆహారంగాను, పేలాలు, స్వీట్ కార్న్ రూపంలో వినియోగిస్తున్నారు. గోదావరి జిల్లాలో హెక్టారుకు సరాసరిన 12 టన్నుల దిగుబడి నమోదవుతోంది.

తొలి రోజు 12 నామినేషన్ల దాఖలు

- బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

కొవ్వూరు: కొవ్వూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా వివిధ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థుల నుంచి బుధవారం నామినేషన్లు స్వీకరించినట్టు ఎన్నికల అధికారులు దొండపాటి కృష్ణారావు, మేడూరి శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్ష పదవికి బొబ్బా భారతి, తొమ్మిదేళ్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి కోమటి గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తొమ్మిదేళ్ల నాగేశ్వరరావు, తక్కెళ్ల చిట్టిబాబు, మెరిపో గోపి, సంయుక్త కార్యదర్శిగా ఎం.నాగమణి, కోశాధికారిగా వీరంశెట్టి రాజా వరప్రసాద్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వై.ప్రకాశరావు, లైబ్రరీ కార్యదర్శిగా వి.నందా, టి.రవికుమార్, మహిళా ప్రతినిధిగా వి.రాజేశ్వరి నామినేషన్లు దాఖలు చేసినట్టు వివరించారు. మొత్తం బార్ అసోసియేషన్‌లో 212 మంది సభ్యులు ఉన్నారన్నారు. ఈనెల 17న నామినేషన్ల పరిశీలన, 20 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. 21 సాయంత్రం 4.30 గంటలకు పోటీలో ఉన్న వారి తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. నామినేషన్ల పరిశీలన అనంతరం సింగిల్ నామినేషన్లు దాఖలైన పదవులకు ఏకగ్రీవం అయినట్టు ప్రకటిస్తామన్నారు. ఈనెల 31 ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పోలింగ్ నిర్వహించి అదే రోజున ఓట్లను లెక్కించి, ఫలితాలను ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



సుబ్బరాజుపేటలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: విద్యుదాఘాతం వల్ల రెండు పోర్షన్ల తాటాకిల్లు దగ్ధం కావడంతో నిరాశ్రయులైన కోడి బుజ్జి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని సుబ్బరాజుపేటలో మంగళవారం రాత్రి తాటాకిల్లు దగ్ధమైన ప్రాంతాన్ని ఎమ్మెల్యే అదే రోజు రాత్రి 12 గంటలకు వెళ్లి పరిశీలించారు. ఆ ఇంట్లో నివాసం ఉంటున్న కోడి గంగరాజు, నవీన్‌లతో మాట్లాడి ప్రమాదం ఎలా జరిగిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు తక్షణ సాయంగా రూ.10 వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యాన్ని ఎమ్మెల్యే అందజేశారు. బాధిత కుటుంబాలకు కాలనీ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, స్థానిక నాయకులు చెట్టే రామకృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

పదేళ్లు నిండితే బ్యాంకు ఖాతాలు తెరవవచ్చు

నల్లజర్ల: పదేళ్ల వయసు నిండిన వారందరికీ బ్యాంకు ఖాతాలు ప్రారంభించవచ్చని బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజరు కె.పాండురంగారావు చెప్పారు. గతంలో ఉన్న 18 ఏళ్ల వయో పరిమితిని పదేళ్లకు తగ్గించినట్టు తెలిపారు. మండలంలోని దూబచర్ల సంఘమిత్ర స్కూల్‌లో బుధవారం ఆయన చిల్డ్రన్ బ్యాంకును ప్రారంభించారు. బ్యాంకులలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఖాతాలు ఉన్నాయన్నారు. స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పొదుపు నేర్పించాలనే ఉద్దేశంతో ఈ బ్యాంకును ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

నేడు సాయిబాబా ఆలయంలో వార్షిక పూజలు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని సాయిబాబా ఆలయంలో గురువారం నుంచి ఆలయ ఐదో వార్షిక విశేష పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా కలశపూజ, గ్రామోత్సవం, అన్నసమారాధన నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ఆస్కార్ పురస్కారంపై హర్షం



కేక్ కట్ చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణ, న్యాయవాదులు

కొవ్వూరు: 'ఆర్ ఆర్ ఆర్ ' చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు దక్కడంపై కొవ్వూరు బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు నీరుకొండ సూర్యనారాయణ బుధవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ పాటకు బాణీలు అందించిన ఎంఎం కీరవాణి, రచయిత చంద్రబోస్‌లకు అభినందనలు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు కోడూరి నరసింహారావు, టీఎస్‌వీ రమణమూర్తి, పి.ఉదయభానుజీ, వీవీ సుబ్బారావు, బందెల సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత భారత్‌కు సహకరించాలి

- రాష్ట్ర క్షయ వ్యాధి నిర్మూలనాధికారి డాక్టర్ రమేష్ విజ్ఞప్తి
- వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్ల పంపిణీ



ధర్మవరంలో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రమేష్, డాక్టర్ వసుంధర

కొవ్వూరు: మరో రెండున్నర ఏళ్లలో అంటే 2025 నాటికి టీబీ (క్షయ) వ్యాధి రహిత భారత్ (టీబీ ముక్త్ భారత్)గా దేశాన్ని తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర క్షయ నివారణ అధికారి, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ టి.రమేష్ అన్నారు. మండలంలోని ధర్మవరంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13 నుంచి 24 వరకూ ఇంటింటికీ వెళ్లి క్షయవ్యాధి అనుమానితులను గుర్తించాలని ఆదేశించారు. వారికి పరీక్షలు నిర్వహించి, క్షయవ్యాధిగా నిర్ధారణ అయితే చికిత్స అందించాలన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు కేవలం మందులే కాకుండా అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడానికి దాతలు ముందుకు రావాలని జిల్లా క్షయ నివారణ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర కోరారు. గ్రామంలో గుర్తించిన తొమ్మిది మంది క్షయ వ్యాధిగ్రస్తులకు టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా పౌష్టికాహారం కిట్లు అందజేశారు. మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.మైఖేల్ ప్రకాష్, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి డాక్టర్, కె.నవీన, ఎంపీహెచ్‌ఈవోలు ఎన్.వెంకటశాస్త్రి, కె.సుదర్శనరావు, పలువురు సీనియర్ టీబీ సూపర్‌వైజర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు రూరల్: క్షయ వ్యాధి నియంత్రణ, సమూల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర క్షయ నివారణ అధికారి పి.రమేష్ అన్నారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో పలు విభాగాలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా కంసాలిపాలెం గ్రామానికి చెందిన ఎస్ ఆర్ సంజీవని హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు సరిపల్లి రమణ సహకారంతో క్షయ రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీఆర్ఎస్ తాతారావు, టిక్‌టాక్ స్టార్ దుర్గారావు దంపతులు పాల్గొన్నారు.

పుడమికి పుత్తడి చీర కట్టినట్టు..



ఉసులుమర్రులో కోతకు సిద్ధమైన వరి సిరులు

పెరవలి: పుడమి తల్లికి బంగారు రంగు చీర కట్టినట్టుగా వరిచేలు పుత్తడి వర్ణంలో కనువిందు చేస్తున్నాయి. పాలు పోసుకుని, ఈనిక జరిగి, గింజ కట్టి, గట్టిపడిన వరిపైరు రంగు మారి కోతకు సిద్ధమైంది. నిడదవోలు నియోజకవర్గంలో ఈ రబీలో 36,500 ఎకరాల్లో వరి సాగు జరిగింది. ముందస్తుగా నాట్లు వేసిన చేలు ఇప్పుడు కోతకు సిద్ధమయ్యాయి. నిడదవోలు మండలంలో 16,500, ఉండ్రాజవరం మండలంలో 11,500 పెరవలి మండలంలో 8,500 ఎకరాల్లో సాగు చేయగా బోర్ల సాయంతో వేసిన పంట ఇప్పుడు కోతకు సిద్ధమైంది. పెరవలి మండలంలోని ఉసులుమర్రు, కానూరు, కానూరు అగ్రహారం, నడిపల్లి, నడిపల్లి కోట, తీపర్రు గ్రామాల్లో బోర్లపైనే సాగు చేపట్టారు.వాతావరణం అనుకూలించడంతో పంట బాగుందని రైతులు చెబుతున్నారు.

ఈ-పంట నమోదు జాబితా ప్రదర్శన



భీమోలు పంచాయతీ కార్యాలయం వద్ద ఈ-పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తున్న దృశ్యం

గోపాలపురం: మండలంలోని రైతులందరూ విధిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు సూచించారు. భీమోలు పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఈ-పంట నమోదు జాబితాను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఏఓ రాజారావు మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ జాబితాను పరిశీలించుకుని, ఒకవేళ మార్పులు చేర్పులు అవసరం అయితే రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఈ రబీ సీజన్‌లో మండలంలో మొత్తం 14,513 ఎకరాలలో రైతులు మొక్కజొన్న,పొగాకు, నాటు పొగాకు, చెరకు,అపరాలు ,నువ్వులు, వేరుశనగ తదితర పంటలను సాగు చేశారన్నారు. భీమోలు పంచాయతీ సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, వీఆర్వో ఎం. సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు జగన్‌మోహన్‌రావు, వ్యవసాయశాఖ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నిడదవోలు కో-ఆర్డినేటర్‌గా సత్యనారాయణ



బండి సత్యనారాయణ

నిడదవోలు రూరల్: భారతీయజనతా పార్టీ (బీజేపీ) నిడదవోలు నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా బండి సత్యనారాయణ నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఈ మేరకు తనకు నియామక పత్రాన్ని అందజేసినట్టు సత్యనారాయణ బుధవారం నిడదవోలులో తెలిపారు. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో బీజేపీ బలోపేతానికి, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



వేగేశ్వరపురం జూనియర్ కళాశాలకు పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



కొవ్వూరులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

- తొలి రోజు డివిజన్‌లో 200 మంది గైర్హాజరు
- తెలుగు/సంస్కృతం పరీక్షలకు 3,964 మంది హాజరు
- ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాల వద్దకు విద్యార్థులు

కొవ్వూరు: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఫస్టియర్ తెలుగు/సంస్కృతం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కొవ్వూరు డివిజన్ పరిధిలోని 15 కేంద్రాల్లో 4,895 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా వివిధ కారణాలతో తొలిరోజు 200 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ ఫస్టియర్‌లో జనరల్ విద్యార్థులు 4,057 మంది ఉండగా వారిలో 3,964 మంది హాజరయ్యారు. 93 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 838 మంది ఉండగా వారిలో 107 మంది గైర్హాజరయ్యారు. 731 మంది పరీక్ష రాశారు. ఇక కొవ్వూరు పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 689 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వారిలో 19 మంది గైర్హాజరయ్యారు. 670 మంది పరీక్షలకు హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 261 మంది హాజరు కావాల్సి ఉండగా, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. చైతన్య కళాశాలలో 222 మందికి గాను ఐదుగురు హాజరు కాలేదు. ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో 206కి ఏడుగురు గైర్హాజరు కావడంతో 199 మంది పరీక్షలు రాశారు.



వేగేశ్వరపురం పరీక్ష కేంద్రం వద్ద రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష ప్రారంభానికి ముందు గోపాలపురం కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు

తాళ్లపూడిలో 22 మంది ..

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. మొత్తం 220 మంది విద్యార్థులకు గాను 178 మంది పరీక్ష రాశారు. మరో 22 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఈ పరీక్ష కేంద్రం వద్ద తాళ్లపూడి కరిబండి గనిరాజు సూర్యకుమారి జూనియర్ కళాశాల, తాళ్లపూడి ఒకేషనల్ జూనియర్ కళాశాల, అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంటర్, వేగేశ్వరపురం కళాశాల విద్యార్థులు పరీక్ష రాశారు. తొలి రోజు పరీక్ష ఎలాంటి అవాంచ ఘటనలు చేటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి. కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ పి.గౌరీనాథ్, పీవీ రమణమూర్తి పర్యవేక్షించారు.

నిడదవోలులో 92 మంది..

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణం, సమిశ్రగూడెంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 2,461 మంది విద్యార్థులు బుధవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. కాగా వారిలో 92 మంది గైర్హాజరయ్యారు.

నల్లజర్ల మండలంలో 56 మంది..

నల్లజర్ల: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలలో మండలంలోని మూడు సెంటర్లలో 56 మంది పరీక్షకు హాజరు కాలేదు. శశి కళాశాలలో 367 మందికి గాను 11మంది, ఏకేఆర్జీ కళాశాలలో 390 మందికి 8 మంది, ఎస్ఆర్‌కే కళాశాలలో 362 మందికి 37 మంది పరీక్షలకు హాజరు కాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

గోపాలపురం మండలంలో 27 మంది..

గోపాలపురం: మండలంలోని గౌతమి కళాశాల, అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల్లో తొలిరోజు బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 525 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 27 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. గోపాలపురం గౌతమి కాలేజీలో 274 మందికి గాను 11 మంది, అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 351 మందికి గానూ 16 మంది పరీక్షలకు హాజరు కాలేదు.